## క్లుప్తంగా

### మార్కెట్లో వరలక్ష్మీవ్రత సందడి



పెదగోపురం వద్ద మార్కెట్ సందడి

**పాలకొల్లు సెంట్రల్:** శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని గురువారం మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మార్కెట్లో పూలు, పండ్లు దుకావద్ద సందడి వాతావరణం నెలకొన్నా వస్త్రదుకాణాలు, బంగారు షాపులు వద్ద మాత్రం జనం వెలవెలబోయారు. వ్యాపారాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వ్యాపారస్తులు వాపోయారు. బస్టాండ్ సెంటర్, మెయిన్‌రోడ్డులో గాంధీబొమ్మల సెంటర్, పెదగోపురం, చినగోపురం, యడ్లబజారు సెంటర్లలో పూలు, పండ్లు దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పాటుచేశారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, యడ్లబజారు శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం భక్తుల దర్శనార్థం ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### జాతీయ రహదారి నిర్వహణ అధ్వానం



చర్చి వద్ద జాతీయ రహదారిపై పడిన గోతులు

**నరసాపురం:** నరసాపురం మీదుగా నిర్మించిన 216 జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా తయారైంది. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రమాదాలు కూడా ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగాయి. రోడ్డుపై ఉన్న గోతుల కారణంగానే ప్రమాదాలు జరగడం, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో చర్చి వద్ద, రుస్తుంబాధ వద్ద సీతారామపురం ప్రాంతాల్లో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై గోతులు పూడ్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్ అందిస్తున్న దృశ్యం

**పాలకొల్లు సెంట్రల్:** పోడూరు మండలంలోని అప్పిచెరువు ప్రాథమిక పాఠశాలకు ఓ దాత రూ. 10 వేలు విలువైన ఫర్నీచర్‌ను బహూకరించారు. గురువారం పాఠశాల హెచ్ఎం డి.క్షేమమూర్తి మాట్లాడుతూ అప్పిచెరువు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోలాటి సుబ్బారావు తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలకు బల్ల, కుర్చీలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో గోగులమండ లక్ష్మీదుర్గ, ఎం వి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### యాచకులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న జయసరిత

**పాలకొల్లు సెంట్రల్:** నిరుపేదలు, నిర్భాగ్యులను ఆదుకోవడంలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. గురువారం పట్టణంలో ఉన్న యాచకులకు వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా చీరలు, జాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీరా మల్లికార్జునుడు, దేవా రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, రాపాక శివకుమార్, రామానుజుల చిన్నమధు, మురళీ, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

### భారత అభియాన్ స్కీమ్‌కు చాంబర్స్ కళాశాల ఎంపిక

**పాలకొల్లు సెంట్రల్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉన్నత భారత అభియాన్ స్కీమ్‌కు స్థానిక చాంబర్స్ కళాశాల ఎంపికవ్వడం అభినందనీయమని కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం, భారత అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ చాంబర్స్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఈ ఎంపికలో భాగంగా మండలంలోని దిగమర్రు, గోరింటాడ, చందపర్రు, చింతపర్రు, లంకలకోడేరు గ్రామాలను దత్తత గ్రామాలుగా ఎంచుకున్నామన్నారు. ఆయా గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం.. వ్యాధుల భయం



యలమంచిలి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



యలమంచిలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



రోగులతో కిటకిటలాడుతున్న పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి వార్డు

- సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న వైనం
- గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేస్తున్న సిబ్బంది

**యలమంచిలి:** వర్షాకాలం అంటేనే అంటు వ్యాధులకు అనుకూల కాలం. మురుగు డ్రయిన్లతోపాటు ఇళ్ల పరిసరాలలో కూడా మురుగు నీరు నిల్వ ఉండిపోవడం, ఎక్కడ పడితే అక్కడే ఉంటున్న చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం వల్ల ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా దోమకాటు వలనే అధిక జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పటిష్ట పారిశుద్ధ్య చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే జ్వరాలబారిన పడకుండా ఉంటారని వైద్యులు చెబున్నారు. కొన్ని రకాల జ్వరాలు ప్రాణాంతకం. కాబట్టి జ్వరమే కదా అని తేలికగా తీసుకోకుండా సత్వర వైద్యం తీసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి**

వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఎండ కాస్తూనే వర్షం కురవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు అధికంగా వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాకాలంలో బురద ప్రభావం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ, బోదకాలు, మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులు అధికంగా వస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న పాలకొల్లు ఏరియా ఆసుపత్రి, రెండు అర్బన్ పీహెచ్‌సీలు, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో ఉన్న నాలుగు లంకలకోడేరు, యలమంచిలి, దొడ్డిపట్ల, మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గత వారం రోజులుగా రోజుకు సరాసరి 100 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్న రోగులు రావడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన**

గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే చేస్తూనే పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను, రోడ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ముఖ్యమని చెబుతున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచిస్తున్నారు. వర్షాకాలం కావడంతో సూపర్ క్లోరినేషన్ చేసిన నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బురదగా ఉన్న చోట బ్లీచింగ్ చల్లేలా చర్యలు తీసుకుంటున్నారు.

**అందుబాటులో వైద్య సేవలు**

జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన రోగులకు మందులు ఇవ్వడమే కాకుండా అత్యవసరమైతే సిలైన్స్ కూడా పెడుతున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలివే

- వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- రోజూ తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- కాచి చల్లార్చి, వడగట్టిన నీటినే మాత్రమే తాగాలి.
- ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచాలకు దోమ తెరలు, కిటికీలు, గుమ్మాలకు దోమల మెస్‌లు వేసుకోవాలి.
- ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి.

### వేగంగా వైద్య సేవలు



జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే రోగులందరికీ సత్వర వైద్యం అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి సెలైన్స్ పెడుతున్నాం. రోగాలబారిన పడకుండా ఉండాలంటే ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు సూచిస్తున్నాం.

– అద్దాల ప్రతాప్‌కుమార్, వైద్యాధికారి, మేడపాడు పీహెచ్‌సీ

### ఘనంగా స్వామినాథన్ జయంతి

**పెనుగొండ:** దేశ వ్యవసాయ రంగంలో డాక్టర్ స్వామినాథన్ తీసుకు వచ్చిన మార్పులతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం ఆచంటలోని మృత్యుంజయ సొసైటీలో రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామినాథన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నెక్కంటి కృష్ణ, పి.మోహన్, జయరాజు, కె.సత్యనారాయణ, బి.రంగారావు పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

**పాలకొల్లు సెంట్రల్:** మెరిట్ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉంటే వాకర్స్ క్లబ్ తనవంతు సహాయ సహకారం అందిస్తుందని క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు తెలిపారు. గురువారం స్థానిక ఛాంబర్స్ కళాశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు అవసరమైన పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సుధాకరరావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు ఆర్థిక సమస్యలతో ఆగిపోకూడదనే ఉద్దేశంతో రూ. 4 వేలు విలువ చేసే పుస్తకాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మానెం బసవరాజు, పీర్ సాహెబ్, జవ్వాజి కళ్యాణ్, కర్రి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**పాలకొల్లు సెంట్రల్:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వీవర్స్ కమ్యూనిటీ భవనంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ హాలులో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసాపురం ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ చేనేత కళను కాపాడుతూ నేటి యువతలోను ఆసక్తి పెంచాలన్నారు. ముందుగా స్థానిక లాకు సెంటర్ వద్ద ఉన్న చేనేత కార్మిక సంఘ నాయకుడు జాన నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షులు బొమ్మన దుర్గాప్రసాద్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, పట్టణ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు, సెక్రటరీ నీలంశెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం చేనేత సంఘ సభ్యులను ఘనంగా సత్కరించారు. అలాగే ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధికార ప్రతినిధి అల్లాడ సూర్యభాస్కర్రావు దిగమర్రు గ్రామంలో చేనేత సంఘ సభ్యులను కలిసి వారి నైపుణ్యాన్ని గుర్తించి ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గణపతి శివరాణి, మల్లేశ్వరరావు, శివరాజ్, కాలేపు చిట్టు కాసులు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత సంఘ సభ్యులు



పెనుగొండ: ఆచంట వేమవరంలో కళాకారులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

**నరసాపురంలో..**

**నరసాపురం:** చేనేత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం స్థానిక 18వ వార్డులో మనువులమ్మ ఆలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవర్స్ యూనిటిడ్ ఫ్రంట్ పట్టణ అధ్యక్షుడు కనకం వర ప్రసాద్, నాయకులు మావూరి సత్యనారాయణ, బూడిద జోగేశ్వరరావు, ఒగ్గు సత్యనారాయణ, వాసా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

**పెనుగొండలో..**

**పెనుగొండ:** జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆచంట వేమవరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేత రంగంలో ఎంతో కాలంగా సేవలందిస్తున్న సీనియర్ కళాకారులను ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘ రాష్ట్ర ప్రతినిధి అల్లాడ సూర్యభాస్కరరావు మాట్లాడుతూ చేనేత కళను కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

### ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై హత్యాయత్నం దారుణం



దొంగ మురళీకృష్ణ

**నరసాపురం రూరల్:** ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై పులివెందుల జెడ్పీటీసీ సభ్యుడి ఉప ఎన్నికల సందర్భంగా దౌర్జన్యం చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ దొంగ మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీపై హత్యాయత్నం ఘటన టీడీపీ పతనానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, అక్రమ నిర్బంధాలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి ఆగ్రహాలను పక్కదారి పట్టించడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలు కూటమి ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలను గమనిస్తున్నారని ఎమ్మెల్సీపై జరిగిన దాడిలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

**పాలకొల్లు సెంట్రల్:** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు చేసిన దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతోమాట్లాడుతూ పులివెందుల మండలం నల్లగొండువారి పల్లెలో జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తుంటే టీడీపీకి చెందిన కొందరు గూండాలు ఒక్కసారిగా రమేష్ యాదవ్, అతని అనుచరులపై మీదపడి దాడి చేయడం చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అనిపిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలకే ప్రాధాన్యతనిస్తుంది తప్ప ప్రజాపరిపాలనకు కాదని అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రజా ప్రతినిధికే రక్షణ లేకపోతే ఈ కూటమి పాలనలో సామాన్యప్రజలు ఎలా మనుగడ సాగించగలరు? అని సందేహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి



మిషన్ హైస్కూల్ రోడ్డులో రహదారిపై వేసిన ఇసుక గుట్టలు

**నరసాపురం:** పట్టణంలో పలు ప్రాంతాల్లో రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రిని రోజులు తరబడి ఉంచుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సామగ్రి వల్ల సైకిళ్లపై స్కూళ్లకు వెళ్లే పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణ సమయంలో ఇసుక, కంకర రోడ్డుపై వేసి వెంటనే తీయకుండా నెలల తరబడి అక్కడే ఉంచేస్తున్నారు. మిషన్ హైస్కూల్ రోడ్డులో ఓ భవన నిర్మాణానికి సంబంధించి మెయిన్‌రోడ్డుపై ఇసుక గత 6 నెలలుగా అక్కడే ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈప్రాంతంలో ఇసుక రోడ్డుపైనే వేసి ఉంచడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కుట్టు మెషీన్ శిక్షణ పూర్తి



కుట్టు మెషీన్లతో శిక్షణ పొందిన విద్యార్థినులు

**పాలకొల్లు సెంట్రల్:** విద్యార్థినులకు చదువుతో పాటు నైపుణ్యాల్లో కూడా శిక్షణ ఉండాలని ఏఎస్ఎన్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ తరగతులు ముగియడంతో డబ్ల్యూఎఫ్ఎఫ్ఐ వారి సహకారంతో కుట్టు మెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ మూడు నెలల పాటు ఈ టైలరింగ్ శిక్షణ ఇచ్చారన్నారు. దీనివల్ల విద్యార్థినులు తమకు కావాల్సిన కళాశాల ఫీజులు, పరీక్ష ఫీజులు సంపాదించుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. 18 మంది విద్యార్థినులు ఈ శిక్షణలో పాల్గొనగా 11 మందికి కుట్టు మెషీన్లు ఇచ్చామన్నారు. మరో వారం రోజుల్లో ఎంబ్రాయిడరీ శిక్షణ తరగతులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కె.భద్రాచలం, బి.వెంకటస్వామి, ఎం.రామకృష్ణ, బీకేవీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక వేడుక



కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

**పాలకొల్లు సెంట్రల్:** తెలుగుజాతి గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు శ్రీ కృష్ణదేవరాయలని యూకేవైసీ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు అన్నారు. గురువారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద పట్టణ శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అధ్యక్షతన దేవరాయల 516వ పట్టాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దాల వాసు, కాపు క్లబ్ అధ్యక్షులు కానూరి ప్రభాకర్, అడబాల వెంకటరమణ, వంగా నరసింహరావు, మాడభూషి కృష్ణప్రసాద్, కఠారి నాగేంద్ర కుమార్, జి.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

**నరసాపురం రూరల్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించాలని ఎంపీడీఓ కె.వీరభద్రరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని వైద్యులు, విద్యాశాఖ అధికారులతో కలిసి సమావేశం టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు విధిగా నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్‌బెండజోల్ మాత్రలను వేయించాలని అన్నారు. ఈ మాత్రలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలం, పట్టణంలోని ప్రభుత్వ వైద్యులు ఎం.మాధురి, కె.జెరూష, చిరంజీవి, రంజిత్‌కుమార్, మోహన, హెచ్ఈ ప్రసన్నకుమార్, హెచ్‌వీ ధనలక్ష్మి, హెచ్ఈ ఎం.నాగమణి, విద్యాశాఖ ఉద్యోగి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా



పాలకొల్లు సెంట్రల్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



పెనుగొండ: బస్టాండ్‌లో కళాజాతను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి

**పాలకొల్లు సెంట్రల్:** తల్లిపాలు బిడ్డకు మొదటి టీకాగా ఉపయోగపడుతుందని డాక్టర్ ఎం.నవ్యజీవన్ అన్నారు. గురువారం మండలంలోని లంకలకోడేరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలో సత్యనారాయణరాజు, నెక్కండి ఆదినారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాల విశిష్టతపై అవగాహన**

పెనుగొండ: తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పెనుగొండ బస్టాండ్‌లో గురువారం బుర్ర కథ కళాజాతను ప్రారంభించారు. బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ ఆహారంతో పాటు, తల్లిపాలు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజరు జి.సుజాత, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### రామేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.60 లక్షలు

**పెనుమంట్ర:** మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. వైశాఖ మాసం మహాశివరాత్రి అనంతరం ఇప్పటివరకు హుండీల ద్వారా రూ.4.69 లక్షలు ఆదాయం లభించినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. మల్లపాలెం గ్రామానికి చెందిన టీటీడీ శ్రీవారి సేవకులు హుండీల లెక్కింపునకు సహకరించారు. కార్యక్రమంలో తణుకు దేవదాయ శాఖ తనిఖీ అధికారి జీఎస్వీ ప్రసాద్, ఆలయ ఈఓ పులగం వేణుగోపాలరావు, ప్రధాన అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులు రాకుండా రోడ్డు ధ్వంసం

**నరసాపురం:** పట్టణంలో 9వ వార్డు ఆకెళ్లవారివీధిలో స్కూల్ బస్సు రాకుండా ఓ దంత వైద్యుడు అడ్డుకుంటున్నారని స్థానికంగా నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీనేత బందన పూర్ణచంద్రరావు నరసాపురం ఆర్డీఓ దాసి రాజుకు ఫిర్యాదు చేశారు. స్కూల్ బస్సులు వస్తే తన ఇంటి ముందు రోడ్డు పాడైపోతుందని సదరు వైద్యుడు తన కారును రాత్రిపూట స్కూల్ బస్సు రాకుండా అడ్డుపెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆర్డీఓ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అయితే బుధవారం రాత్రి ఈ ప్రాంతంలో మున్సిపల్ రోడ్డును స్కూల్ బస్సులు రాకుండా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం వివాదంగా మారింది. సదరు వైద్యుడే మున్సిపల్ రోడ్డును ధ్వంసం చేశారని పూర్ణచంద్రరావు ఆరోపిస్తున్నారు. ఈ దారుణంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.